# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, సీపీ, ఇతర అధికారులు

- నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి
- అభ్యర్థికి తప్పనిసరిగా ఓటరు జాబితా వివరాలు అందించాలి
- కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ అన్నారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 3వ తేదీన విడుదల అవుతుందని, నవంబర్ 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు ఆర్వో కార్యాలయంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో సమయపాలన పాటించాలన్నారు. ప్రతి నామినేషన్ వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి తప్పనిసరిగా ఓటరు జాబితా వివరాలు అందించాలని, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులకు గుర్తులు కేటాయించే సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అందుబాటులో ఉన్న ఫ్రీ గుర్తులను మాత్రమే కేటాయించాలన్నారు. నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత అవసరమైన బ్యాలెట్ పేపర్ల తయారీ బ్యాలెట్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్ సక్రమంగా జరిగేందుకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలన్నారు. ఈవీఎం యంత్రాలు భద్రపర్చే స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మోడల్ పోలింగ్ ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు ప్రత్యేక వసతుల కల్పనపై శ్రద్ధ వహించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు సిబ్బంది, మీడియా ప్రతినిధుల, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలు తప్పకుండా అమలు చేయాలని, సీ విజిల్ యాప్‌ను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల విధులు నిబంధనల మేరకు నిర్వహించాలని, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ జరగాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్ పాల్గొన్నారు.


సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి

# రాజకీయంగా ఎదుర్కోలేకనే దాడులు

**మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఖండించిన బీఆర్ఎస్ నాయకులు**

సిద్దిపేట, అక్టోబర్ 30 : బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి దురదృష్టకరమని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అంటే క్రమశిక్షణ గల పార్టీ అని, తెలంగాణ ఉద్యమం అహింసాయుతంగా 14 ఏండ్ల పాటు పోరాటం చేసిన పార్టీ ఏనాడు భౌతిక దాడులకు పాల్పడలేదన్నారు. ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడి రాజకీయ కుట్రలో భాగమేనన్నారు.

దాడికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మంత్రి వ్యక్తిగత సహాయకుడు రాము, పార్టీ ఒకటో వార్డు అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హింసా రాజకీయాలకు తావులేదు


**రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ వంగ నాగిరెడ్డి**



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 30 : మెదక్ ఎంపీ, దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేయడం హేయమైన చర్య అని.. నిందితులను కఠినంగా శిక్షించాలని రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ వంగ నాగిరెడ్డి డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఉన్న ఈ ప్రాంతంలో హింసా రాజకీయాలను ప్రోత్సహించడం సరికాదన్నారు. దాడిని ఖండిస్తున్నామని.. దాడి చేసిన నిందితుడితో పాటు అతడిని ప్రేరేపించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. దాడి చేయించిన వ్యక్తి అభ్యర్థిత్వాన్ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్‌లో చేరిన వాజిత్ పటేల్

బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట, అక్టోబర్ 30 : సిద్దిపేట పట్టణానికి చెందిన మైనార్టీ నాయకుడు, సామాజిక సేవకుడు వాజిత్ పటేల్ సోమవారం మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తన నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వాజిత్ పటేల్‌తో పాటు ముఖ్య అనుచరులు అభు పటేల్, షారూఖ్ పటేల్, లవకుమార్, పాల్ పార్టీలో చేరారు. మైనార్టీల కోసం సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతూ ప్రజలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీకి, సిద్దిపేట అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఈజీఎస్ సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన నిందితుడిని శిక్షించాలి

*-ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్*

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 30: బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం చేయడం చాలా బాధాకరమని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభాకర్‌రెడ్డి మంచి నాయకుడని, అందరికీ సాయం చేసే గొప్ప మనస్సు అని చెప్పారు. అలాంటి నాయకుడిపై కత్తితో దాడి చేయడం దురదృష్టకరమని, ఈ దాడిని అందరూ ఖండించాలన్నారు. హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 30 : గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రేబర్తి పీఏసీఎస్ సీఈవో బోయిని శ్రీధర్, ఐకేపీ ఏపీఎం ప్రసాదరావు అన్నారు. సోమవారం ఉమ్మడి మద్దూరు మండలంలోని రేబర్తి, వల్లంపట్ల, బైరాన్‌పల్లి, బెక్కల్, తోర్నాల, కొండాపూర్, ధూళిమిట్ట, కమలాయపల్లి, కూటిగల్, లద్నూర్, ధర్మారం, సలాఖపూర్, మర్మాముల, నర్సాయపల్లి, లింగాపూర్, అర్జున్‌పట్ల, జాలపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు సిద్ధి మల్లయ్య, మహేందర్, నర్సాయపల్లి గీత గ్రామైఖ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దేవరాజుల కనకలక్ష్మి, రాములమ్మ, వీవోఏ రేణుక పాల్గొన్నారు.

**గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

చేర్యాల, అక్టోబర్ 30 : మండలంలోని 12 గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం ప్రకాశ్ సోమవారం ప్రారంభించారు. మండలంలోని ఆకునూరు, రాంపూర్, శబాష్‌గూడెం, నాగపురి, తాడూరు, పోతిరెడ్డిపల్లి, చిట్యాల, పెదరాజపేట, వేచరేణి, ముస్త్యాల, వీరన్నపేట, చుంచనకోట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం ప్రారంభించారు. కార్యక్రమాల్లో సీసీలు చంద్రమౌళి, నర్సయ్య, పోచమ్మ, వీవోఏలు, మహిళా సంఘాల అధ్యక్షురాలు పాల్గొన్నారు.

# 'ఖాదీ వస్త్రాలను ఆదరిద్దాం'



పట్టణంలో ఖాదీ మహోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 30 : ఖాదీ వస్త్రాలను ఆదరించాల్సిన బాధ్యత దేశపౌరులందరిపై ఉందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథకం యూనిట్ల ఆధ్వర్యంలో సోమవారం ఖాదీ వస్త్రా మహోత్సవాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఖాదీ మహోత్సవం ర్యాలీని ప్రసాద్ ప్రారంభించారు. అంతకుముందు ఖాదీ వస్త్రాధారణ, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో యోగాకు మంచి ఆదరణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట, అక్టోబర్ 30 : యోగాకు అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రాముఖ్యత ఉందని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సిద్దిపేట టీటీసీ భవన్‌లో మూడు రోజుల పాటు జరగనున్న అండర్ 14,17 బాల బాలికల రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ యోగా పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోటీల్లో మంచి ప్రతిభ చూపాలని, నిత్యం యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీశ్, రాష్ట్ర పరిశీలకులు కమలాకర్, కరుణం గణేశ్, ఇమ్రాన్, రవీందర్, జిల్లా యోగా శిక్షణ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శిలు పాతూరు సుజాత, గ్యాదరి భిక్షపతి, ఆస లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఏర్వ అశోక్, బండారుపల్లి శ్రీనివాసులు, రమణారెడ్డి, ఉప్పలయ్య, వెంకటస్వామి, హరికిషన్, రాజుకుమార్, రాజమౌళి పాల్గొన్నారు.

# 'ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఖండిస్తున్నాం'

చిన్నకోడూరు, అక్టోబర్ 30: బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఎంపీపీ విలేకరులతో మాట్లాడారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఉండగా, కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తి కత్తితో కడుపులో పొడవడం హేయమైన చర్య అన్నారు. ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి కఠిన శిక్ష పడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.